క్లుప్తంగా

రోజూ వ్యాయామాలు చేయాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలోని భవిత కార్యాలయంలో బుధవారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. అంగవైకల్యం గల చిన్నారులకు ఫిజియోథెరపిస్ట్ అరుణ్, వైద్య పరీక్షలు చేశారు. ప్రతి రోజు ఫిజియోథెరపీకి సంబంధించిన వ్యాయామాలు చేయాలని అన్నారు. సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులున్నారు.

డ్రాప్ ఔట్ విద్యార్థిని బడిలో చేర్పించిన అధికారులు



భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన డ్రాప్ ఔట్ విద్యార్థి ఒకరిని విద్యాశాఖాధికారులు గుర్తించి బుధవారం స్థానిక పాఠశాలలో చేర్పించారు. గ్రామానికి చెందిన నారి వికాస్ అనే విద్యార్థి కొన్ని రోజులుగా పాఠశాలకు రావడం లేదని గుర్తించారు. వెంటనే విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి వికాస్‌ను స్థానిక ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్లయ్య, హెచ్‌ఎం శ్రీనివాస్, సీఆర్‌పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సంఘాలను బలోపేతం చేయాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం రాజిరెడ్డి మాట్లాడారు. స్త్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. గ్రామ సంఘాల అభ్యున్నతికి కృషి చేయాల్సిన బాధ్యత సంఘ సభ్యులపై ఉందన్నారు. కార్యక్రమంలో సీసీలు రాములు, లింగం, ఆంజనేయులు, నరేందర్ రెడ్డి, సౌజన్య, మండల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

పందులకు వ్యాక్సిన్లు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంలో పందులకు స్వైన్ ఫీవర్ వ్యాక్సిన్లు వేసినట్లు ఏడీ సుభాష్ తెలిపారు. పందుల నుంచి స్వైన్ ఫ్లూ వ్యాపించకుండా ఉండేందుకు వీటికి వ్యాక్సిన్లు వేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు అర్చన, సిబ్బంది రమేష్ తదితరులున్నారు.

వసతి గృహాల ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా ఖలీల్



మాచారెడ్డి: ఏబీవీపీ వసతి గృహాల జిల్లా కన్వీనర్‌గా మాచారెడ్డివాసి ఖలీల్ను నియమించినట్లు ఆయన తెలిపారు. బుధవారం రాష్ట్ర సంఘటన మంత్రి కరుణాకర్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఖలీల్ మాట్లాడుతూ.. వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై ఎనలేని పోరాటం చేస్తానన్నారు. తనను కన్వీనర్‌గా నియమించిన కరుణాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'ఎక్సైజ్ శాఖకు ఆపాదించొద్దు'

కామారెడ్డి అర్బన్: ఒక వ్యక్తి తన స్వలాభం కోసం మాకు తెలియకుండా చేసిన నేరానికి అందరిని బాధ్యులను చేయడం సరికాదని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కామారెడ్డి సీఐ విజయ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికల్లో 'ఖాకీకి మత్తు మరక' శీర్షికన ప్రచురితమైన వార్తలో ఒక వ్యక్తి నేరాన్ని మొత్తం ఎక్సైజ్ శాఖను ఎత్తిచూపారని అన్నారు.

టీషర్టుల పంపిణీ

కామారెడ్డి అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్‌కు 50 క్రీడా టీషర్టులు అందజేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు పి.సత్యం, కార్యదర్శి రాజనరసింహారెడ్డి తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి రోటరీ క్లబ్ ఎప్పుడూ ముందుంటుదని అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు.

చేపలు చచ్చిపోతున్నాయ్

- ఫిష్‌ఫామ్‌తో తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి వస్తదన్న అధికారులు
- చేపల పెంపకానికి సరిపడా రుణం ఇప్పిస్తామని అధికారుల హామీ
- రూ.లక్షల్లో సొంత డబ్బులు పెట్టి షెడ్లను ఏర్పాటు చేసుకున్న రైతులు
- ఉదయ్ ఆక్వా కనెక్ట్స్ కంపెనీ ద్వారా సరఫరా చేసిన కోరమొట్ట చేప పిల్లలు
- నాలుగు నెలల్లో 4 వేల చేప పిల్లల మృతి
- లబోదిబోమంటున్న ఫిష్‌ఫామ్ రైతులు
- పట్టించుకోని అధికారులు



భూంపల్లి శివారులో ఏర్పాటు చేసిన ఫిష్‌ఫామ్ షెడ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామ సంఘాల మహిళల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడానికి ఏడాది క్రితం 'ఫిష్‌ఫామ్'ల ఏర్పాటు పేరుతో డీఆర్‌డీఏ, సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా రైతులను ప్రోత్సహించారు.'ఫిష్‌ఫామ్' జిల్లాలోనే ఆదర్శంగా ఉండాలని ఫామ్ ఏర్పాటుకు కావాల్సిన రుణ సదుపాయం కల్పిస్తామని అధికారులు, రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సైతం వచ్చి ఫిష్‌ఫామ్‌ను ప్రారంభించారు. వారం రోజుల పాటు వివిధ మండలాల్లో ఉన్న మహిళలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సులు నిర్వహించి వివరించారు. రుణ సదుపాయం కల్పిస్తాం మీ డబ్బులతో షెడ్‌లను ఏర్పాటు చేసుకోండని రైతులకు సూచించడంతో రైతులు ఆగమేఘాలమీద చేపల పెంపకం కోసం ప్రత్యేక షెడ్‌లను ఏర్పాటు చేసుకున్నారు.

రూ.5 లక్షలు నష్టపోయిన రైతు..

ఇదంతా బాగానే ఉన్నప్పటికి...మండలంలోని భూంపల్లికి చెందిన ఈదులాయ గంగాధర్‌కు చేపల పెంపకం కోసం ఆయన పడ్డ ఇబ్బందులను వివరించారు. చివరికి రూ.5 లక్షల వరకు నష్టపోయినట్లు పేర్కొన్నారు. మొదటగా రూ.2 లక్షల రుణ సదుపాయం కల్పించారు. దానికి ముందు రూ.82 వేలతో డీడీ తీసి పంపిన తర్వాత రూ.2 లక్షలను మంజూరు చేశారు. ఉదయ్ ఆక్వా కనెక్ట్స్ కంపెనీ ద్వారా 4 వేల కోరమొట్ట చేప పిల్లలను పంపించారు. నాలుగు సంచుల దాణ ఇచ్చారు. ఆ దాణ 15 రోజులు మాత్రమే వచ్చింది. ఒక దాణ సంచి కొనుగోలు చేయాలంటే రూ.3 వేలు చెల్లించాలి. 12 సంచుల దాణాను గంగాధర్ సొంత డబ్బులతో కొనుగోలు చేసుకున్నారు. మళ్లీ 13 సంచులు తెచ్చి దాణ వేశాడు. మొత్తం రూ.75 వేలు దాణ కోసం ఖర్చు చేశారు.

మళ్లీ 2 వేల చేప పిల్లలు..

నాలుగు నెలలు గడిచే సరికి 4 వేల చేపలు పూర్తిగా చనిపోయాయి. ఈ విషయాన్ని గంగాధర్ ఐకేపీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు కంపెనీ దృష్టికి తీసుకెళ్లారు. కంపెనీ వారు గంగాధర్ ఫిష్‌ఫామ్ వద్దకు వచ్చి మీరు మమ్మల్ని కాపాడాలి.. మిమ్మల్ని మేం కాపాడుతాం అని చెప్పి ఒక నెల తర్వాత మళ్లీ 2 వేల చేప పిల్లలు తెచ్చారు. మళ్లీ కొద్ది రోజుల తర్వాత అందులో 13 వందల వరకు చేప పిల్లలు చనిపోయాయి. ఇదేమిటని గంగాధర్ మళ్లీ ఐకేపీ అధికారులను సంప్రదించాడు. మీరు బ్యాంక్‌కు వెళ్లండి రాయితీ కింద రూ.5 లక్షల రుణం ఇస్తారు అని చెప్పడంతో గంగాధర్ పద్మాజీవాడి తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌కు వెళ్లాడు. బ్యాంక్ మేనేజర్ సంబంధిత ఉదయ్ ఆక్వా కనెక్ట్స్ కంపెనీతో చర్చించారు. 65 శాతం రుణం చెల్లించాల్సి ఉంటుందని చెప్పడంతో గంగాధర్ ఒప్పుకున్నాడు. రూ.4 లక్షల 20వేలు మంజూరు చేశారు. ఆ డబ్బులను ఉదయ్ ఆక్వా కంపెనీ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయడంతో ఇదేమిటని గంగాధర్ బ్యాంక్ అధికారులను ప్రశ్నించారు. నువ్వు మళ్లీ షెడ్‌ను కొత్తగా వేసుకోవాలి అప్పుడే ఈ డబ్బులు ఇస్తామని చెప్పారు. లేకుండా ఇవ్వబోమని చెప్పడంతో ఆవేదనకు గురయ్యాడు. ఆ తర్వాత అధికారులూ పట్టించుకోలేదు. తన పాటు మరో ఐదుగురు రైతులు కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు.



ఫిష్‌ఫామ్‌లో మృతి చెందిన చేపలు

అధికారులు ఆర్భాటం కోసం ఫిష్‌ఫామ్‌లను ఏర్పాటు చేసి గాలికొదిలేయడంతో తాము పూర్తిగా అప్పుల్లో కూరుకుపోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి ఫిష్‌ఫామ్ రైతులను పట్టించుకొని ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

చాలా నష్టపోయిన...

కలెక్టర్ చెప్పిండు గదా అని మస్తు లాభం వస్తదని ఫిష్‌ఫామ్ పెట్టినం. పెట్టిన రెండు నెలల్లోనే వెయ్యి చేపలు చచ్చిపోయినయ్. కంపెనీ వాళ్లకు చెప్పినా పట్టించుకోలేదు. అధికారులకు చెప్పినా లాభం లేకుండా పోయింది. మా అమ్మ గ్రామ సంఘంలో సభ్యురాలు కావడంతో ఒక యూనిట్ కింద రూ.3 లక్షలు ఇచ్చిండ్రు.. షెడ్ నిర్మాణం, పైప్‌లైన్ వేశాం. అసలుకే నష్టం జరగడంతో ప్రతి నెల గ్రామ సంఘంలో రూ.12 వేలు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. కంపెనీ వారు నకిలీ సీడ్ పంపిణీ చేయడం వల్లనే ఈ పరిస్థితి వచ్చింది. పూర్తిగా ఫామ్‌ను మూసుకున్నా.

– ప్యారం స్వామి, వజ్జపల్లి

అప్పులు చేయాల్సి వచ్చింది

ఫిష్‌ఫామ్ పెట్టుకుంటే మంచి లాభాలు వస్తాయి.. దీంతో ఆర్థికంగా బాగుపడొచ్చని చెప్పడంతో ఫామ్ ఏర్పాటుకు ముందుకు వెళ్లాను. చివరికి నష్టమే మిగిలింది తప్ప ఎలాంటి లాభం లేదు. ఏ రైతు అయినా సరే ఎట్టి పరిస్థితుల్లో ఇలాంటి ఫిష్‌ఫామ్‌లు పెట్టుకొని అప్పుల పాలు కావద్దు.

– ఈదులాయ గంగాధర్, భూంపల్లి

అధికారుల మాట విని నష్టపోయా

పెద్ద సార్లు చెప్పిండ్రు కదా అని ఒక యూనిట్ కింద రూ.3 లక్షలు గ్రామ సంఘం నుంచి తీసుకున్నా. మూడు నెలల వరకు చేపలు పెరిగినయ్. ఐదో నెల ప్రారంభంలోనే చచ్చిపోవడం మొదలైంది. ఇదేందని సార్లను అడిగితే ఫస్ట్ టైమ్ కదా పిల్లలను మళ్లీ ఇస్తాం అన్నారు. ఇవ్వలేదు. సొంత డబ్బులు పెట్టి షెడ్ వేసుకున్నా. ఎనిమిది నెలల్లో ఒక చేప కిలో వరకు వస్తదని చెప్పిండ్రు. కానీ అరకిలో కూడా సక్కగా రాలేదు. వాళ్లిచ్చిన వెయ్యి చేపల్లో సుమారు 650 వరకు చచ్చిపోయినయ్.

– బెస్త రాజు, ఫిష్‌ఫామ్ రైతు, మోడెగాం

వేరే చేప పిల్లలు పంపిణీ చేశాం

జిల్లా వ్యాప్తంగా 56 ఫిష్‌ఫామ్‌లు ఏర్పాటు చేశాం. ఇంచుమించు అంతటా బాగానే ఉంది. సదాశివనగర్ మండలంలో ఏర్పాటు చేసిన ఫిష్‌ఫామ్‌లలో చనిపోయిన చేపలకు బదులు కంపెనీ వారు వేరే పిల్లలు కూడా సరఫరా చేశారు. రైతులకు లబ్ధి చేకూరే విధంగా చూస్తున్నాం. మొదటి సారి పంపిణీలో కొంత ఇబ్బందులు పడ్డ మాట వాస్తవమే.

– రమేశ్ బాబు, ప్రాజెక్టు మేనేజర్, డీఆర్‌డీఏ, కామారెడ్డి

విద్యార్థుల కోసం బస్సులు నడపాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

కామారెడ్డి టౌన్: జిల్లాలో విద్యార్థులకు సరిపడా బస్సులను నడపాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందిరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ కృష్ణ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం వల్ల మహిళలు ఎక్కువగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం వల్ల ఉదయం, సాయంత్రం విద్యార్థులకు బస్సు ఎక్కడానికి వీలు కావడం లేదన్నారు. దీంతో బస్సుల్లో వెళ్లే విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వివరించారు. తక్షణమే ప్రత్యేక బస్సులు వేయాలని కోరారు. నగర కార్యదర్శి చరణ్, జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, నవీన్, అల్తాఫ్ ఉన్నారు.

సమయ పాలన పాటించని ఉపాధ్యాయులు



తాళం వేసి ఉన్న బేగంపూర్ పాఠశాల

పెద్దకొడప్‌గల్(జుక్కల్): అధికారుల పర్యవేక్షణ లోపం మారుమూల పల్లెల్లోని పాఠశాలల విద్యార్థులకు శాపంగా మారింది. ఇందుకు ఉదాహరణ మండలంలోని బేగంపూర్ తండా పాఠశాల. బుధవారం బేగంపూర్ పాఠశాలకు చెందిన రెగ్యులర్ ఉపాధ్యాయురాలు అరుణ జ్యోతి సెలవుపై వెళ్లగా, సంబంధిత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు ఇతర పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై పంపారు. ఆయన ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పాఠశాలను నడిపి ఆ తర్వాత వెళ్లిపోయారు. దీంతో చదువుకోవాల్సిన చిన్నారులు ఆరు బయట ఆడుకుంటున్నారు. పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎం రామాంజనేయులును వివరణ కోరగా.. ఆ ఉపాధ్యాయుడి తప్పులేదన్నట్లుగా సమాధానమిచ్చారు.

ఆటో యూనియన్ కార్యవర్గం



మాచారెడ్డి: ఆటో యూనియన్ కామారెడ్డి జేఏసీ నూతన కార్యవర్గాన్ని బుధవారం మండల కేంద్రంలోని షబ్బీర్ అలీ ఫంక్షన్ హాలులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోదాసు నర్సింలు, గౌరవ అధ్యక్షుడిగా రాజిరెడ్డి, డైరెక్టర్‌గా కృష్ణంరాజు ఆయా మండలాల ఇన్‌చార్జీలుగా మల్లేష్ యాదవ్, స్వామి గౌడ్, లింగం, స్వామి, మైశయ్యలను ఎన్నుకున్నారు.

వాహనాలను జాగ్రత్తగా నడపాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వాహనదారులు వాహనాలను జాగ్రత్తగా నడపాలని ఎస్సై గణేష్ బుధవారం సూచించారు. పొగమంచు కారణంగా వాహనాలు సరిగా కనిపించడం లేదని, ఓవర్ స్పీడ్‌గా వెళ్లడం చేయవద్దని అన్నారు. లైట్లు వేసుకుని వాహనాలను నడపాలని, ఓవర్‌టేక్ చేస్తూ వాహనాలను నడపొద్దని అన్నారు.

ఘనంగా రాములోరి అక్షింతల శోభాయాత్ర



దోమకొండలో..

సాక్షి నెట్‌వర్క్: అయోధ్య రాముడి అక్షింతలతో కూడిన కలశ శోభాయాత్రలను జిల్లాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేశారు. జనవరి 15 వరకు ప్రతి హిందు కుటుంబానికి శ్రీరాముడి అక్షింతలు చేరవేస్తామని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు.



సదాశివనగర్‌లో..

ఎకో టూరిజానికి రూ.10 కోట్లు మంజూరు



బాన్సువాడ రూరల్: బాన్సువాడ పట్టణంలోని కల్కి చెరువుకు అవతలి వైపు గుట్టను ఎకో టూరిజంలో భాగంగా అభివృద్ధి చేయడానికి రూ.10 కోట్లు మంజూరు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని కాంగ్రెస్ పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన కాంగ్రెస్ నాయకులు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, కొత్తకొండ భాస్కర్, తదితరులతో కలిసి బోర్లం రోడ్డులో టూరిజం అభివృద్ధి కోసం స్థలాన్ని పరిశీలించారు.

విద్యార్థులు ధ్యానం చేయాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): విద్యార్థులు సరస్వతి ధ్యానం చేయాలని కృష్ణానందస్వామి అన్నారు. తాడ్వాయి మండలం క్రిష్ణాజివాడిలోగల ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సరస్వతి ధ్యానంపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు ఏకాగ్రతతో ధ్యానం చేసినట్లయితే ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు మంచిగా అర్థమవుతాయన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించి క్రమశిక్షణతో ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం నివేదిత, ఉపాధ్యాయులు సుమలత, సత్యనారాయణ, హేమంత్ పాల్గొన్నారు.

సమాచారం..

పీఈటీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పీఈటీ పోస్టు భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ భరత్ భూషణ్ తెలిపారు. జనవరి 10లోపు దరఖాస్తులు పంపించాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక మెరిట్ ప్రకారం ఉంటుందని, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

31న స్వామి నరేంద్రాచార్య మహరాజ్ రాక

నిజాంసాగర్(జుక్కల్): ఈ నెల 31, జనవరి 1న అనంత శ్రీ విభూషిత జగద్గురు రామానాందచార్య శ్రీస్వామి నరేంద్రాచార్య మహరాజ్ జుక్కల్ మండలంలోని తెలంగాణ ఉపపీఠానికి వస్తున్నారని భక్తులు తెలిపారు. దోస్త్‌పల్లి గ్రామంలోని ఉప పీఠములో స్వామీజీ ప్రవచనాలు చేస్తారని, భక్తుల దర్శనాలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇసుకపై వాడివేడిగా చర్చ

- సర్పంచులు, అధికారుల మధ్య వాగ్వాదం
- బీర్కూర్‌లో మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బాన్సువాడ : బీర్కూర్‌లో మంజీర పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించడంతో సభలో వాగ్వాదం చోటు చేసుకుంది. బుధవారం బీర్కూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రఘు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభలో తహసీల్దార్ జనార్దన్, ఎస్సై నర్సింలు మాట్లాడుతూ.. బీర్కూర్ మంజీర పరివాక ప్రాంతం నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో ఆయా గ్రామాల సర్పంచులు ఒక్కసారిగా లేచి అధికారులతో వాగ్వాదానికి దిగారు. పేదలు ఇల్లు నిర్మించుకోవాలంటే ఇసుక తప్పనిసరి అని, ఇసుక లేకుంటే ఇళ్లు ఎలా నిర్మించుకుంటారని, అనుమతులు ఇవ్వకుంటే చాలా ఇబ్బందులు వస్తాయని సర్పంచులు అధికారులకు సూచించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయని, ప్రస్తుతం ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేమని, పై అధికారుల నుంచి ఆదేశాలు వస్తేనే అనుమతులు ఇస్తామని అధికారులు వివరించారు. అప్పటి వరకు అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని అన్నారు.

బీర్కూర్ మండల కేంద్రం నుంచి నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాలకు ఆర్టీసీ బస్సులను నడపాలని ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, కస్తూర్బా విద్యాలయం వద్ద మిషన్ భగీరథ నీరు వృథాగా పోతుందని మరమ్మతులు చేయించాలని అధికారులకు వివరించారు. వచ్చే నెలలో సర్పంచుల పదవీకాలం ముగిస్తుండడంతో ఆయా గ్రామాల సర్పంచులను ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో భానుప్రకాష్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కాశీరాం తదితరులున్నారు.

నేటి నుంచి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్



నిజాంసాగర్‌లో ఇంటింటికి దరఖాస్తులను పంపిణీ చేస్తున్న జీపీ కార్యదర్శి గంగారాం



మాట్లాడుతున్న జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ మోహన్‌రెడ్డి



బిచ్కుందలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో



రాజంపేటలో మాట్లాడుతున్న అధికారులు

సాక్షి నెట్‌వర్క్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఆరు గ్యారంటీలను నెరవేర్చేందుకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని పంచాయతీ కార్యదర్శులను ఉన్నతాధికారులు ఆదేశించారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమం నేటి(28) నుంచి జనవరి 6 వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. ప్రజాపాలనలో ఆరు గ్యారంటీల అమలులో భాగంగా క్షేత్రస్థాయిలో గ్రామ పంచాయతీలకు కేటాయించిన తేదీల వారీగా దరఖాస్తుల స్వీకరణ కోసం గ్రామసభలు ఏర్పాటు చేయాలని కార్యదర్శులను సూచించారు. ప్రభుత్వ సిబ్బంది ఉదయం 8 గంటల నుంచి 12 వరకు అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 వరకు దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడి టీచర్లు, ఐకేపీ, ఆశావర్కర్లు ప్రజాపాలనలో పాల్గొనాలని ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ మహాలక్ష్మి, రైతు భరోసా, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పథకాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని సంబంధిత కార్యదర్శులను ఆదేశించారు.

ఘనంగా శబరిమాత పాదుక పూజోత్సవం



ఊరగుట్టపై పాదుక పూజోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమ సమీపంలో గల ఊరగుట్టపై రెండో రోజు బుధవారం శబరిమాత పాదుక పూజోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన హంస వాహనంలో శబరిమాత పాదుకలు, చిత్రపటాన్ని ఉంచి, భక్తులు భక్తి శ్రద్ధలతో ఊరేగింపు చేశారు. మహిళ భక్తులు, యువకులు చేసిన రకరకాల నృత్యాలు పలువురిని అలరించాయి. ఉత్సవాలకు 5 లక్షల మందికి పైగా భక్తులు తరలి వచ్చారు. ఉత్సవ కార్యక్రమాలు గురువారంతో ముగియనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అంగరంగ వైభవంగా అయ్యప్ప పడి పూజ

- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనం
- అయ్యప్ప గేయాలతో మార్మోగిన కళాశాల ప్రాంగణం



హోమం చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : పట్టణంలో బుధవారం నిర్వహించిన అయ్యప్ప మండల పూజ మహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పెద్ద ఎత్తున అందంగా అలంకరించిన మండపంపై అయ్యప్ప స్వామికి అభిషేకాలు చేశారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హోమంలో కూర్చున్నారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త భారతీయం సత్యవాణి, చార్‌ధామ్ ఆలయ ప్రధాన అర్చకులు శివలింగ మహదేవ్ స్వామీజీలు హాజరై అయ్యప్పస్వామి విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, గురుస్వాములు మల్లికార్జున్, ర్యాల విఠల్‌రెడ్డి, వీరప్ప, నాగరాజ్, శంకర్‌గౌడ్, కృష్ణారెడ్డి తదితరులున్నారు.